

# బీటువారిన చేల

"బీటవారిన చేల
పీయూషములు రాల
గరికలేని పొలాల
మరకతమ్ములు లేప
సాగుమా
ఓ నీలమేఘమా!"

పక్కింటిలోంచి పాట వినబడుతూంది. సి. నా. రె. చక్కగా వ్రాశారు పాట. భావం అత్యద్భుతంగా ఉంది. కానీ, ఆ నీలమేఘానికి రాయలసీమని రాళ్ళసీమగానే ఉంచాలని ఆశ. రత్నాల సీమగా మార్చాలనే ఉద్దేశం బొత్తిగా లేదు. అందుకే చుక్క రాలకూడదనే నల్ల మబ్బులు గుంపులు గుంపులుగా ఎటో పారిపోతున్నాయి. ఆకాశంలో నలు దిక్కులకి చెదిరిపోతున్నాయి.

ఈ ఊర్లో వర్షాలు పడటమంటే అదో అపురూపం. వర్షాకాలంలో ఆర్భాటం మాత్రం విపరీతం ఉంటుంది. నల్లటి మబ్బులు దట్టంగా అలుముకుంటాయి. అప్పుడప్పుడు చె

రుగా గాలి. చూస్తుంటే నేల్లాళ్ళు కుండపోతగా వర్షం కురిసే సూచనలు. కానీ, మరో అయిదు నిమిషాల్లో గాలి విసురుగా వేసి నిర్మలమైన నీలాకాశం కన్పిస్తూ నిలుస్తుంది. నీటి చుక్క పడుతుందనే ఆశ పుటుక్కున తెగుతుంది. ఆడంబరం ఎక్కువ, ఆచరణ తక్కువ. సగటు మధ్య తరగతి మానవుడి మనస్తత్త్వం. అందులో ఆంధ్రుల ఆరంభ శూరత్వం ప్రస్ఫుటంగా తెలుస్తుంది.

పాట వింటూ ఇంత ఆలోచిస్తోంది సుందరి. చిరిగిన చీరకు అతుకు వేసుకుంటూ పాట వింటూంది. ఆలోచనల కంతరాయం తమ్ముడి రాక.

"కిలో బియ్యం రెండున్నరట. అయిదు కిలోలు మాత్రం తెచ్చాను." ఉస్సురుస్సురంటూ బజారునుంచి వచ్చాడు మాధవ.

"కిలో రెండున్నరా? మరీ మండిపోతోంది" అంది సంచీ అందుకుంటూ సుందరి తల్లి.

"నయం. ఇంకొన్నాళ్ళు పోతే బియ్యం మూడు రూపాయలు" అన్నాడు మాధవ.

"ఏం తింటాం — ఇలా ఖరీదులు మండిపోతుంటే?" పలుక్కుంది సుందరి తల్లి.

"సబ్బులు తెచ్చావ్రా?" తమ్ముణ్ణి అడిగింది సుందరి.

"ఏ సబ్బులూ లేవు బజారులో. జై సబ్బులున్నాయి. ఒక్కటి రూపాయి ఎనభై పైసలట. తెమ్మంటే తెస్తాను."

"వద్దులే. సెనగపిండితో రుద్దుకుంటే సరి. పక్కింట్లో పేపరొచ్చిందేమో? పట్టారా."

పేపరు తెచ్చి అక్క దగ్గర పడేసి పోయాడు.

పక్కింట్లో వాళ్ళు కాస్త ఉన్నవాళ్ళు పిల్లకంటే. అందుకే రేడియో, పేపరు లాంటి హంగులన్నీ ఉన్నాయి. తమకు ఏమీ లేదు.

పేపరు మొదటి పేజీలో బీహారులో వరదలు ... సరి ... బొంబాయిలో కుంభవృష్టి... ఖర్మ ... ఇక్కడ ఒక్క చుక్క లేవు నీళ్ళు. అక్కడ భారీవర్షాలు. అందుకే ఖరీదులు ఇలా మింటి కెగసి పోతున్నాయి. అరే...కవిత్వం వస్తోందా? ఆకలి కవిత్వం వ్రాయొచ్చు. ఆకలితో వుంటే కవిత్వం వస్తుందా? అసలు వ్రాయడానికి అర్హత ఉందా? కడుపు నిండకపోతే కవిత్వం ఎక్కణ్ణుంచి వస్తుంది, సార్! రాదు.

"ఏమిటేం? పేపరు చదవడం అయిందా? నాకోసారి ఇయ్యి నువ్వు చదవక పోతే." తమ్ముడు గద్దించి అడగకుండా చేతిలోంచి లాక్కుపోయాడు పేపరు.

ఎదురింట్లో తులసి ముగ్గులు పెడుతూంది. తులసి అంతస్తు తమకన్నా తక్కువగా కనిపిస్తుంది. నిజానికి ఇద్దరి అంతస్తులు ఒకటే. తులసి తండ్రి బడిపంతులు. ఆయనకి అధిక సంతానం. తన తండ్రి టీచరే. కానీ, పిల్లలు తక్కువ కావడం వల్ల కాస్త తిండికి లోటులేదు. వాళ్ళు ఒక పూటే. మరీకష్టం. తులసి తన ఈడుదే. పదో క్లాసుదాకా ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఆ తరవాత దాని చదువుకి ఆఘాతం. ఒక్కొపు కడుపు నకనకలాడుతూంటే చదువేం ఒంట బడుతుంది? ఇది తన ఉద్దేశం. తులసి బొత్తిగా ఒప్పుకోదు. "నా తెలివి అంతంతమాత్రమే, సుందూ! చాకిరీ, ఆకలీ కలిశాయి" అంటుంది.

ఏదో రెండు ఛాన్సులకి అది పది పాసయింది. ఆలోప్పుగా, సుందరి ఇంటర్ అవడం, బి. ఏ. లో చేరడం జరిగింది.

"ఏమిటి సుందూ, పేపరు విశేషాలు?" అంటూ తులసి వచ్చింది, బిందె తీసుకుని.

తమ మాటతో మాత్రం ఇంకా నీళ్ళున్నాయి. అవి తీసుకోవడానికి ఇరుగుపొరుగు వస్తారు. తులసి తప్పకుండా వస్తుంది. సుందరితో మాట్లాడడం తులసికి ఉన్న ఒకే ఒక కాలక్షేపం. ఇద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు.

"చెప్పు ... ఏమిటి పేపరు సంగతులు?" పక్కనే కూర్చుంటూ అడిగింది తులసి.

"బీహారులో భారీ వర్షాలట. పేటలు పేటలు కొట్టుకు పోతున్నాయట."

"బాగుంది. ఇక్కడ ఒక బొట్టయినా రాలలేదే?"

"రాదు. ఇది రాళ్ళ సీమ. అందుకని వర్షాలు పడవు. అయినా, భారీ వర్షాలూ నష్టమే కదా? అతివృష్టి, అనావృష్టి— వినలేదూ?"

"ఊఁ. ఇంకా చెప్పు."

"అక్కడేదో ఊర్లో బజార్లో కిలో బియ్యం అయిదు రూపాయలట."

ఇంకా ఏదో చెప్పబోతుంటే తులసి ఆపింది.

"ఈ కబుర్లు వద్దు, సుందూ! సరదా కబుర్లు చెప్పు. ఎప్పుడూ ఈ దరిద్రం గురించే చెప్తుంటుంటే కడుపు నిండదు కదా?" అంది తులసి.

## శ్రీమతి ఉమాశశి

తులసిని నిశితంగా పరిశీలించింది సుందరి. తిండి తిని కనీసం ఓ రోజయి ఉంటుంది.

ఈ దరిద్రం గురించి ఎన్ని నవలలు, ఎన్ని కథలు, ఎన్ని సినిమాలు? ప్రభుత్వం ఎందుకు ప్రజల్ని పరిస్థితుల్లో ఉంచుతూంది?

దేవుని గుళ్ళో అమ్మవారికి నగలు అలంకారమట. అట్లా భరతమాతకి ఈ దారిద్ర్యం, దానితో కుంగిపోయే మనుషులు అలంకారాలా? రోజురోజుకీ పెరిగిపోతున్న జనం, దానికితోడు దరిద్రం హిందూదేశానికి రత్నాలహారం కాబోలు! 'ఇదే మన దేశం' అంటూ పత్రికల్లో కడుపులు వీపు కంటుకుపోయిన పిల్లల్ని చూసి డబ్బు చేసుకుంటున్న జనం ముత్యాల హారాలా? సుందరి తలలో పిచ్చి ఆలోచనలు. తులసిని చూస్తే నిజంగానే పిచ్చెక్కిపోతుంది సుందరికి.

"చెప్పా, సుందూ!"

ఏం మాట్లాడకుండా సుందరి లేచి లోపలికి వెళ్ళింది. ఏదో నిమిషాల్లో ఓ పళ్ళెంతో ఉప్మా తీసుకొచ్చి సుందరి తులసికిచ్చింది.

"తిను, తులసీ. తిన్నాక మాట్లాడతాను."

"వద్దొద్దు ... నా కాకలిగా లేదు." పళ్ళెం పక్కనే పెట్టేసింది తులసి.

"నీకు లేకపోవచ్చు. ఆకలి లేకపోయినా తిను. ఫరవాలేదు."

"వద్దు. నన్నిబ్బంది పెట్టకు." తులసి మొహం ఎర్రచేసుకుంది. కళ్ళు నీళ్ళకుండ లయ్యాయి.

"అభిమానం అనేది అందరికీ ఉంటుంది, తులసీ! నాకూ ఉంది. కానీ, నువ్వు ఆకలితో ఉంటే నేనుమాత్రం కడుపు నింపుకుని నీతో కబుర్లు చెప్పే స్వార్థం లేదు" అంది సుందరి.

"అహఁ ... అది కాదు."


"నువ్వు తిన్నాకే మళ్ళీ మాటలు" అంది సుందరి.

"నా ఒక్కదాని కడుపు నింపుతున్నావు కాని, ఇంట్లో అందరూ ..." పళ్ళెం చేత్తో తీసుకొని అంటున్న తులసి మాటల్ని సుందరి తుంచేసింది.

"ఏమీ మాట్లాడకు. అందరికీ పెట్టే స్థితి నాకు లేదు. దేశంలో ప్రతి వ్యక్తికీ తిండి అందించే శక్తి ఎవరికి లేదు. నే నెంతదాన్ని!" అంటూ సుందరి మళ్ళీ చీరను చేతిలోకి తీసుకుంది.

బీటవారిన చేల ...

"రావు రావు ... ఈ పాట పక్కింట్లో రేడియోలోంచి ఎన్నిసార్లొస్తుందో!" అంది విసుగ్గా సుందరి.



తరంగ, మంగళం — ఎస్. వర్నశెట్టి (మద్రాసు)

"రేడియో కాదది. టేప్ రికార్డర్ నిన్నే కొన్నట్టున్నారు" అంది తులసి.

"అలా చెప్పు. రికార్డ్ చేస్తున్నట్టు లేదు అదీ కాదన్న మాట. పిరికవాళ్ళు, మీసాలు తెగ పలుకుతున్నాయి నా ఫ్రెండ్స్ నుంచి." పాట వింటున్నా రిద్దరూ.

"జనాభా రోజు రోజుకీ ఇంత పెరిగిపోతుంటే ఏమవుతుంది, సుందరీ! కనీసం ఇలా నీలాంటి వాళ్ళు స్నేహితుల్ని కూడా పెట్టలేని పరిస్థితి వచ్చేస్తుందేమో?" ఎటో చూస్తూ అంది తులసి.

"వచ్చేస్తుందేమో కాదు. వచ్చేసింది. మొన్న ఓ ఇంగ్లీషు పత్రికలో చదివాను. పదో పాతికేళ్ళకి దేశంలో ఏమీ మిగలదట తినటానికి. ఇప్పుడు చూశావా ఖరీదులు ఎలా మండిపోతున్నాయో! కిలో బియ్యం ..."

"చెప్పకు, చెప్పకు ... అదుగో, అమ్మ పిలుస్తోంది. వెళతా నిక." చిందె తీసుకుని పరుగెత్తింది తులసి.

"ఏమమ్మాయ్ సుందరీ, వస్తావా సాయంత్రం? పార్టీ ఉంది." రాజమ్మ గారు వీధిలోంచి వస్తూ అన్నారు. ఆవిడ మంచి పలుకుబడి గల వ్యక్తి ఆ ఊరిలో. ఆమె లేని సంఘంకానీ, సభగానీ ఉండదు. ఓ మండలికి సెక్రటరీ అయితే, ఇంకో సమాజానికి ప్రెసిడెంటు. ఇంతింతననేల? ఆ ఊరికే ఆవిడ జీవనాడి.


"రండి, రండి. సంగతేమిటి?" చిరుగు కుట్టేసి చీర దండెం మీద వేసి, కుర్చీ జరిపి అడిగింది సుందరి. సుందరికి ఆమె అంటే గౌరవం. ఏదో మహిళా సమాజంలో సుందరికి చిన్న ఉద్యోగం కూడా ఇప్పించింది. సుందరికి కొంత సంగీతం వచ్చు కాబట్టి సభ్యురాండ్రకి వారానికి మూడు రోజులు పాటలు నేర్ప మని రాజమ్మగారే చెప్పింది సుందరికి. సభ్యులందరి నుంచి వసూలు చేసిన డబ్బులోంచి ఏభయి రూపాయలు ఇచ్చే ఏర్పాటు. చాలా తక్కువే. అయినా, సుందరి సంగీత జ్ఞానానికి అది చాలు. లలిత సంగీతం నేర్పుతుంది సుందరి. పనులన్నింటిలోనూ చేదోడు వాదోడుగా ఉంటుందని రాజమ్మకి సుందరి మీద కించిత్ ప్రేమ.

రాజమ్మగారి గొంతు విని సుందరి తల్లి కాఫీ కప్పుతో రంగ ప్రవేశం చేసింది. కుశల ప్రశ్న లయాయి. కాఫీ సేవించడం అయింది.

"మధ్యాహ్నమే రావా లమ్మాయీ. మరిచిపోకు. రంగవల్లు లేయాలి."

"అలాగే."

"ఈసారి అమ్మాయిలు బొమ్మ వేద్దా మని. పిండితో బొమ్మలు అందంగా ఉంటాయట" అం దావిడ.



"ఆతులు, ముగ్గులు తప్ప బొమ్మలేమి వచ్చంటే నాకు?" నసిగింది సుందరి.

"ఎప్పుడూ ఆతలేనా అని మెంబర్లు అడుగుతున్నారు." సణిగింది రాజమ్మ.

"తులసికి మంచి మంచి బొమ్మ లెయ్యటం వచ్చు. పిలుచుకు వచ్చేదా?" ఆగి అడిగింది సుందరి. చాలాసేపు నసిగి తరవాత ఒప్పుకుం దావిడ.

ఇంక తులసి కంగారు, సుందరి హడావిడి అంతా ఇంతా కాదు.

మధ్యాహ్నం మూడు కొడుతుండగా తులసి, సుందరి సమాజానికి వెళ్ళారు.

"రండి, మీ కోసమే చూస్తున్నాను. అదిగో, ఆ మూల బియ్యం. పిండితో బొమ్మలు బాగోండవట. అందుకే బియ్యం తెప్పించాను. ఆ అలమారాలో రంగు లున్నాయి. అక్కడే మరో సెల్ఫ్‌లో చెమ్కీ ఉంది. అద్దముక్కలు కూడ ఉన్నాయి. త్వరగా కానివ్వండి" అంది రాజమ్మ హడావిడిగా. అని అటు మరో పనిగా వెళ్ళిపోయింది.

బియ్యపు సంచీ తీసుకొచ్చి దగ్గర పెట్టాడు బంట్రోతు. మెల్లగా సంచీ మూత విప్పింది సుందరి. కళ్ళు మెరి శాయి.

"ఎంత మంచి బియ్యం! చూడు, తులసీ." సుందరి గుప్పెటతో బియ్యపు గింజలు తీసి తులసికి చూపింది.

"చూస్తున్నాను. మొంతిగొలకులను కుంటా." ఇంటి దగ్గర తమ్ముళ్ళు, చెల్లెళ్ళు గుర్తు కొచ్చారు తులసికి.

"ఏమి టాలోచిస్తున్నారు? ఇంకా పని ప్రారంభించలేదా?" సుడిగాలిలా వచ్చి అడిగింది రాజమ్మ.

"అబ్బే... ముగ్గుతో వేస్తే చాలదా? బియ్యం ఎందుకండీ పాడుచేయడం?" అడిగింది సుందరి.

తన మనసులోని మాట సుందరి అడిగేసరికి తులసికి తృప్తిగా అనిపించింది.

"ఓయ్, సుందరీ! ఏమి టనుకుం టున్నావు? బియ్యంతోనే బొమ్మ చాలా అందంగా వస్తుందట. ఎవ రొస్తున్నారో తెలుసా? మినిస్టర్‌గారు. మాటలా? పని కానివ్వండి త్వరగా." విసుక్కుంటూ వెళ్ళిపోయిం దావిడ.

"ఊఁ ... కానీ, తులసీ. బొమ్మ వెయ్యి. ఇదిగో చాక్‌పీస్." నేలంతా శుభ్రంగా కడిగించారు. తుడిచి అంచె వెళ్ళిన అమ్మాయిలు బొమ్మ వేసింది తులసి. దోసెడు పూలతో అంజలి ఘటించే అమ్మాయి అత్యద్భుతంగా ఉంది. ఓ వైపు తిరిగి కూర్చుని ఈశ్వర పాదార్పణ గావించుకుంటున్న కలికి. జడ అందంగా అల్లింది. అలంకరణ ఎంత బాగుందో! రకరకాల రంగులు కలిపిన బియ్యపు గింజల్ని ఇద్దరూ కలిసి బొమ్మపై సున్నితంగా అద్దారు.

"నీ చేతిలో ఇంత కళ ఉందని నాకు తెలియదు, తులసీ!" అంది సుందరి.

నవ్వింది తులసి. జడ కుచ్చెల మీద బంగారు చెమ్కీ అద్ది తుది మెరుగులు దిద్దింది.



"చాలా బాగుంది" అంది రాజమ్మ.

"నే చెప్పిన చోట కొవ్వొత్తులు పెడితే ఇంకా బాగుంటుంది" అంది తులసి. ఉచిత సలహా. అయినా, వెంటనే పాటింపబడింది.

బొమ్మ వేస్తున్నంతసేపూ, బియ్యపు గింజలు అద్దుతున్నంతసేపూ తులసి అన్య మనస్కంగానే ఉంది.

ఆమె మనసు చెద పట్టిన పుట్టలా ఉంది. జోరీగల్లాంటి ఆలోచనలు మనసును దొలిచేస్తున్నాయి.

మినిస్టరుగారు రావడం, పార్టీ బ్రహ్మాండంగా జరగడం — అంతా సరదాగా గడిచిపోయింది. ఆఖర్న మిగిలిన వాళ్ళు రాజమ్మ, సుందరి.

"ఇంక మనం వెడదాం. ఏమమ్మా, సుందరీ?"

"ఆఁ. వెళ్ళిపోదామండి. ఇదిగో ... ఇక్కడే తులసి కూడా ఉండాలి పిలుస్తాను." అప్పుడు గుర్తొచ్చింది సుందరికి తులసి సంగతి.

"తులసీ!" రెండుసార్లు పిలిచింది. సమాధానం లేదు.

"లోపలుందేమో పిలుచుకొస్తాను."

"ఏం చేస్తోంది లోపల? త్వరగా రా... నాకు నిద్రొస్తోంది."

"ఆఁ ..." అంటూ లోపలి కొచ్చింది సుందరి.

గది అంతా చీకటిగా ఉంది. ఎక్కడుం దమ్మా తులసి? వెళ్ళిపోయి ఉంటుంది. ఆరాటం తులసికి సహజం. అయినా, తనూ చెప్పకుండా వెళ్ళదే అని తులసి సంగతి అనుకుంది. ఆ గదిని వెతుకుతుంది? వెళ్ళిపోయి ఉంటుందని నిర్ధారించుకుంది. కొంచెం వెతకడం అవసరం. గబుక్కున సుందరికి దీపం బాగు తెచ్చి సంగతి గుర్తొచ్చింది. దీపం లేదు కాబట్టి తెస్తానంటూ వెళ్ళి తెచ్చింది సుందరి. ఆఁ. బొమ్మ వేసిన వరండాలో పడేసింది ఆ దీపం. తెచ్చుకుంటే సరి. వరండాలోకి వెళ్ళి దీపం మీట నొక్కింది. ఎదురుగా ఉన్న దృశ్యాన్ని చూసి నోట మాట రాక చేష్టలు దక్కి నిలుచుండిపోయింది సుందరి. హఠాత్తుగా వెలుగు పడేసరికి చేతిలోని బరువైన కొంగును జారవిడిచేసింది తులసి.

ఎర్రని, పచ్చని, నలుపుపచ్చని రంగు రంగుల బియ్యపు గింజలు నేలంతా ప్రతిఫలిస్తున్నాయి.

దీపం కాంతిలో మెరిసే పచ్చని బియ్యపు గింజలు రక్తాశ్రువుల్లా అనిపించి, అవి తులసి కంటి వెంట రాలిన భావన కలిగి సుందరికి స్పృహ తప్పింది.

★